క్లుప్తంగా

22 నుంచి దశమి ఉత్సవాలు



చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయం

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ ఆది చింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 22న రాత్రి 2 గంటలకు స్వామివారి పల్లకీ సేవతో ప్రారంభం అవుతుంది. 23న దశమి మహోత్సవం, 24న మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు, 25న పారువేట ఉత్సవం కనుల పండువగా సాగనున్నాయి. 26న స్వాముల వారి ఆరాధన ఉత్సవాలతో దశమి ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు ఆలయ కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

డ్రాయింగ్‌లో ప్రతిభ



విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేసి అభినందిస్తున్న హెచ్‌ఎం ఇందిరాదేవి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరి వాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి నఫీజ్ హమ్మద్ రోటరీ క్లబ్ వారు నిర్వహించిన డ్రాయింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించాడని హెచ్‌ఎం ఇందిరదేవి తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థికి సన్మాన సభ ఏర్పాటు చేసి మోడల్, సర్టిఫికెట్ అందించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బి.పి.వెంకటేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ జె.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రామన్న, ఉపాధ్యాయులు రామకృష్ణ, రమణమూర్తి, యశోధ, శివగౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభం



ఎమ్మిగనూరులో జావిలెన్‌త్రో విసురుతున్న విద్యార్థి

ఎమ్మిగనూరుటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం అథ్లెటిక్ క్రీడా పోటీలు ప్రారంభమైయ్యాయి. ఇందులో పలు పాఠశాలల విద్యార్థులకు పరుగు పందెం , జావిలెన్‌త్రో పాటు ఇతర అథ్లెటిక్ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తాలూకా కోఆర్డినేటర్ యండి.అస్లాంబాషా, మండల కోఆర్డినేటర్ బజారప్ప, వ్యాయామ ఉపాధ్యాయులు రాజారాం మోహన్, సుజనకుమారి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే కొలువు



డీఎస్సీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: నిరుద్యోగ యువత కష్టపడి చదితే ప్రభుత్వ కొలువు సాధించవచ్చని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రంగస్వామి, స్థానిక ప్రగతి ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రగతి డీఎస్సీ కోచింగ్ సెంటర్‌లో అనంతపురం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కార్తీక్ డీఎస్సీ అభ్యర్థుల కోసం రూపొందించిన ఇంగ్లిష్ కంటెంట్, మెథడ్ పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకుడు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. పలు కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు.

- ఆదోని మార్కెట్ యార్డులో ప్రారంభం కాని రాయితీ భోజనం
- గత నెలలో ప్రారంభమైన వేరుశనకాయల సీజన్
- ఈనెలలో పత్తి దిగుబడుల రాక ప్రారంభం
- భోజనాలు దొరక్క రైతన్నలు పస్తులుండాల్సిన పరిస్థితి
- సౌకర్యాలూ అంతంత మాత్రమే

అన్నదాత ఆకలి కేక



యార్డులో పత్తి దిగుబడుల వద్ద వేచివున్న రైతులు,



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయితీ భోజనం వడ్డిస్తున్న అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్లు (ఫైల్)

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, యార్డు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆదాయం రూ.కోట్లలో ఉన్నా అభివృద్ధి మాత్రం శూన్యమంటూ తీవ్రంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నెల నుంచి వేరుశనగకాయలు మార్కెట్‌యార్డుకు రైతులు అధిక సంఖ్యలో అమ్మకానికి తీసుకొస్తున్నారు. అలాగే ఈనెల నుంచి పత్తి దిగుబడులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే యార్డులో రైతులకు మాత్రం తగిన నీరు, రాయితీ భోజనం సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రూ.15కే కడుపునిండా భోజనం ఇచ్చి ఆదుకుందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

రోజుకు వెయ్యి నుంచి 1500 మంది రైతులు

జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, గుంతకల్, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి పత్తి, వేరుశనగకాయలు, ఆముదాలు, పొద్దు తిరుగుడు దిగుబడులను ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు అమ్మకానికి రైతులు తీసుకొస్తున్నారు. ప్రతిరోజూ దాదాపు వెయ్యి నుంచి 1500 మంది వరకు రైతులు దిగుబడులను యార్డుకు వాహనాల్లో వేసుకొస్తున్నారు. వారంతా భోజనం చేయాలంటే బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. అంతేకాకుండా దిగుబడులను వదిలేసి యార్డు నుంచి కొంత దూరమైనా వెళ్లాల్సి వస్తోంది. అదే యార్డులో రైతులకు భోజనం పెడితే బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. టెండర్ అయిన వెంటనే తమ దిగుబడుల వద్దకు వెళ్లి కాటా వేసుకోవడానికి సులభంగా ఉంటుంది. బయటకు వెళితే కాటా వేసుకోవడానికి కూడా సమయం దొరకదు. మరలా ఆ వ్యాపారి రావాలంటే ఆలస్యమవుతుంది. దీంతో వ్యాపారి కోసం వేచి ఉండి కడుపుకాల్చుకొని ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.15కే రాయితీ భోజనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్కాన్ సంస్థ సహకారంతో నాణ్యమైన భోజనం అందించి రైతుల ఆకలి తీర్చింది. యార్డు నుంచి రూ.20, రైతు నుంచి రూ.15 మిగతాదంతా ఇస్కాన్ సంస్థ భరించేది. దీంతో రైతులకు కడుపునిండా నాణ్యమైన భోజనం అందేది. ఇందులో స్వీటు, చట్నీ, సాంబారు, అన్నం, పప్పు, మజ్జిగ వడ్డించేవారు. బయట రూ.70 నుంచి రూ.100 పెట్టినా ఇంతటి నాణ్యమైన, రుచికరమైన భోజనం దొరకదు. బయట కల్తీతో కూడుకున్న ఆహారం తిని అనారోగ్యం పాలు కావడమేగాకుండా కడుపు కూడా నిండదు.

ప్రతిరోజూ వేల సంఖ్యలో దిగుబడులు

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరు నెలల సీజన్ ఉంటే మరో ఆరు నెలలు అన్ సీజన్ ఉంటుంది. రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు ఆదోని. సీజన్‌లో ప్రతిరోజూ వేరుశనగ కాయలు 10 వేల నుంచి 20 వేల సంచులు అమ్మకానికి రైతులు తీసుకొస్తున్నారు. అదేవిధంగా పత్తి దిగుబడులైతే ప్రతిరోజూ 5 వేల నుంచి 10 వేల వరకు యార్డుకు వస్తాయి. రైతులు దిగుబడులు అమ్మకానికి తీసుకొచ్చేందుకు రాత్రి నుంచే సిద్ధం చేస్తారు. ఉదయం లేచినవెంటనే భోజనం కూడా చేయకుండానే వాటిని యార్డుకు తీసుకొస్తారు. అయితే యార్డులో మధ్యాహ్న భోజనం లేకపోవడంతో రైతులు పస్తులుండాల్సి వస్తోంది. సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ప్రభుత్వం, యార్డు అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

రెండు రోజుల్లో రాయితీ భోజనం ప్రవేశపెడతాం



కర్నూలు మార్కెట్‌యార్డులో ఇస్కాన్ సంస్థచే రాయితీ భోజనం ఇదివరకే ప్రారంభమయ్యింది. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో కూడా రెండు రోజుల్లో ప్రారంభం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు నాణ్యమైనభోజనం అందిస్తాం. నీటి సౌకర్యం యార్డులో 12 పాయింట్లు పెట్టాం. రైతులు ఎక్కువగా వస్తున్నారు కాబట్టి మరిన్ని పాయింట్లు ఏర్పాటు చేస్తాం.
– రామ్మోహన్‌రెడ్డి, యార్డు సెక్రటరీ

బయటకు వెళ్లలేక పస్తులున్నా



బయట భోజనం కడుపునిండదు. కొంతదూరం వెళ్లాలి. అంతలోపు టెండర్ అయిపోతుంది. అయినా వెంటనే టెండర్ ఫారం వస్తుంది. అనంతరం కాటా వేస్తారు. అసలు భోజనం చేయడానికి బయటకు వెళ్లాలంటే సమయం ఉండదు. యార్డులోనే ప్రభుత్వం, యార్డు అధికారులు రాయితీ భోజనం కలిప్తే రైతులకు మేలు చేసిన వారవుతారు. దీంతో దగ్గరగా ఉండడం వల్ల తొందరగా వెళ్లి భోజనం చేసి రావొచ్చు. – అయ్యప్ప, రైతు, దొడ్డనగేరి

గతంలో రూ.15కే భోజనం ఇచ్చేవారు



గతంలో మార్కెట్ యార్డులో రూ.15కే రాయితీ భోజనం అందించేవారు. అన్ని రకాలతో రుచికరమైన, నాణయమైన భోజనంతో కడుపునిండేది. బయట రూ.100 పెట్టినా భోజనంనిండదు. రైతులకు ప్రభుత్వం, యార్డు అధికారులు అతి తక్కువ ధరతో భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలి. సీజన్ కూడా ప్రారంభమయ్యింది.
– హుసేని, రైతు, మాంత్రికి

గోవిందమ్మను పరామర్శించిన సబ్ కలెక్టర్



గోవిందమ్మ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మను గురువారం సాయంత్రం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కల్లుకుంట గ్రామంలో కొన్ని రోజుల కిత్రం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు దళిత మహిళ గోవిందమ్మను స్తంభానికి కట్టేసి కొట్టిన విషయం తెలిసిందే. సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మాట్లాడుతూ ఇక మీదట ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తరుపున రావాల్సిన పరిహారంను త్వరగా వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయి, వైద్యులు తదితరులు ఉన్నారు.

రైతు కష్టాన్ని దోచుకుంటున్న ఏజెంట్లు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులు కష్టించి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో కమీషన్ల పేరుతో కొందరు కమీషన్ ఏజెంట్లు దోచుకుంటున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఆరోపించారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ విక్రయాలకు పేరుపొందిన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు జిల్లా నుంచే కాకుండా అనంతపురం, కర్ణాటకలోని రాయచూరు, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రైతులు పంట ఉత్పత్తులు విక్రయాలకు తీసుకొస్తారన్నారు. పంట ఉత్పత్తులను తెచ్చే వాహనాల డ్రైవర్లకు కొంత డబ్బు ముట్ట జెప్పి కొందరు ఏజెంట్లు వారి దుకాణాలకు దిగుబడులు అన్‌లోడింగ్ చేయించుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఒక ఏజెంట్ ద్వారా మరో ఏజెంట్‌కు వాటిని విక్రయించి తక్‌పట్టీ ఇచ్చిన తరువాత వంద రూపాయలకు రూ.2లు కమీషన్ తీసుకోవాల్సిఉండగా, రూ.4లు కమీషన్ తీసుకుంటున్నారన్నారు. ఇలా రైతులను దోపిడీ చేస్తున్న ఏజెంట్ల లైసెన్స్‌లు రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్, సమీవుల్లా, ఖాజ, మల్లికార్జున గౌడ్, సుంకన్న నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆదోని సెంట్రల్: రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని స్టేషన్ మేనేజరు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రైల్వే బోర్డు ఆదేశాలు మేరకు స్టేషన్లో పరిసరాలను ఊడ్చి, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ స్టేషన్ మనది, మనందరిది కనుక అపరిశుభ్రంగా ఉంచకూడదన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదని సూచించారు. కార్యక్రమములో రైల్వే పోలీసు ఎస్‌ఐ లక్ష్మణ్, బుకింగ్ సూపర్ వైజర్ త్రిభువన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని ఆదోని డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు చీపురు పట్టి పరిసరాలను ఊడ్చారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు.



రైల్వే స్టేషన్ పరిసరాలను ఊడుస్తున్న రైల్వే అధికారులు, కార్మికులు

నులిపురుగు నివారణపై 25న స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

ఆదోని టౌన్: ఆదోని సబ్‌డివిజన్ పరిధిలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో మిగిలిపోయిన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసేందుకు ఈనెల 25 స్పెషల్ డ్రైవ్ చేపడతామని ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆదోని సబ్‌డివిజన్ పరిధిలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 అర్బన్‌హెల్త్ సెంటర్‌ల పరిధిలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో 94 శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు విజయంవతంగా వేశామన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనపై వివరిస్తూ ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్నామన్నారు. మిగిలిన పిల్లలకు ఈనెల 25వ తేదీన ప్రత్యేకంగా మాత్రలు వేసి వంద శాతం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

నందవరం: మండలంలోని నది కైరవాడి గ్రామానికి చెందిన బోయ నరసింహుడు కుమారుడు బోయ వీరేష్ అదే గ్రామానికి చెందిన వృత్తి వర్గానికి ఓ బాలిక ప్రేమించుకున్నారు. ఇద్దరూ మైనర్లే. పెద్దలు తమ ఇష్టాన్ని అంగీకరించని భావించిన వీరిద్దరూ బుధవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలోకి పోతున్న సమయంలో అబ్బాయి స్నేహితుడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆ స్నేహితుడు ఇరు కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశాడు. కుటుంబాల సభ్యులు ఇరువురిని కర్నూలు పెదాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

నైట్‌వాచ్‌మెన్ల వేతనాలివ్వండి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే నైట్‌వాచ్ మెన్‌లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నైట్ వాచ్‌మెన్లకు ప్రభుత్వం నెలకు రూ.6వేలు ఇస్తుందన్నారు. ఇచ్చే వేతనాలు కూడా ఏడు నెలలుగా పెండింగ్‌లో వున్నాయని తెలిపారు.

నేడు మున్సిపల్ మీట్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

22న గయోపాఖ్యానం నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు గయోపాఖ్యానం (యుద్ధసీను) నాటక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. పౌరాణిక నాటక రంగంలో గత 5 సంవత్సరాల నుంచి సంచలనం సృష్టిస్తున్న 15 సంవత్సరాల బాలిక ధూపం తిరుమల తేజ ఇందులో శ్రీకృష్ణ పాత్రను పోషిస్తుందని తెలిపారు. ధూపం రామకృష్ణ అర్జున పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు డీఎస్పీగా ఉపేంద్రబాబు



ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు డీఎస్పీగా యం.ఉపేంద్రబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ బీ.సీతారామయ్య గుంటూరు ఎస్‌బీకు బదిలీ కాగా, అనకాపల్లి మహిళా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ యం. ఉపేంద్రబాబు ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.

కల్లుకుంట ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

ఎమ్మిగనూరుటౌన్: పెద్దకడుబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మను కొట్టిన ఘటనపై సమగ్ర విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్ఎస్ చీఫ్ హైకోర్ట్ న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్, కోక కన్వీనర్ సునీల్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ కోరారు. ఈమేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ విజయ భారతి సాయిని కలిసి వినతి పత్రం అందించారు. తామిచ్చిన వినతిపై స్పందించిన ఆమె ఏపీ పోలీస్ శాఖకు, ఉన్నతాధికారులకు ఈ ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు వారు తెలిపారు.

మహిళలు చైతన్యవంతం కావాలి

కోసిగి: మహిళలు చైతన్యవంతులై అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, బాలిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరి దేవి అన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మహిళల సంరక్షణపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి, మహిళా పోలీస్ దేవి, ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకులు సిద్ధార్థ రెడ్డి, ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామన్న, ఏబీవీపీ కార్యకర్తలు విజయ్ భాస్కర్ నాయుడు, సోము, లక్ష్మణ్, వినోద్, వీరేష్‌లు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల ప్రారంభం

ఆదోని టౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం అన్నా క్యాంటీన్లను కూటమి నాయకులు ప్రారంభించారు. ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో టీడీపీ నాయకుడు ఉమాపతి, పాత బస్టాండు సర్కిల్‌లో జనసేన పార్టీ నాయకులు, హెడ్ పోస్టాఫీసు వద్ద బీజేపీ నాయకులు క్యాంటీన్‌లను ప్రారంభించారు.

ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచుకొస్తాయో తెలియదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, దేవరాజ్, గణేష్, యశ్వంత్, ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగలదిన్నె విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు



మంచాల సునీల్ కుమార్

నందవరం: నాగలదిన్నె గ్రామానికి చెందిన మంచాల సునీల్ కుమార్ అనే విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు వరించింది. గ్రామానికి చెందిన మంచాల జోసెఫ్, మంచాల సువర్ణ దంపతుల కుమారుడైన సునీల్ కుమార్ గ్రామంలో ఏడవ తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం ఎంపీఆర్ స్కూలు పత్తికొండలో పదో తరగతి, చిన్నటేకూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదవి నీట్ పరీక్షలు రాశాడు. నీట్‌లో 720 మార్కులకు గానూ 541 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌కు ఎంపికయ్యాడు. విద్యార్థి ఎంపికపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ఎస్సీ, ఎస్టీ కేసులపై వేగవంతంగా దర్యాప్తు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా బాధితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కేసులు పునరావృత్తం కాకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సోమన్నను ఆదేశించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి శాంతిభద్రతల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికుమార్ ప్రతినెలా చివరి తేదీన గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని జరిగేలా చూడాలని సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, డివిజన్‌లోని తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్ఏవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా డిమాండ్ చేశారు. గురువారం ఆర్ఏవీఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే దిశగా సీఎం చంద్రబాబు ఎన్ఎంసీకి లేఖ రాయడం దారుణమన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వలన నష్టపోయేది పేద విద్యార్థులేనని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అటు పేద విద్యార్థులకు వైద్య విద్య, నిరుపేదలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని వాపోయారు. వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలో ఆదోని మెడికల్ కళాశాల పనులను నిలిపివేయడమే కాకుండా పులివెందుల మెడికల్ కళాశాలకు వచ్చిన 50 సీట్లను రద్దు చేయాలని ఏకంగా కేంద్రానికి లేఖ రాసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని విమర్శించారు. పక్క రాష్ట్రాలు మెడికల్ సీట్ల కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, వచ్చిన సీట్లను వద్దని చెప్పే మీ ప్రభుత్వాన్నే చూస్తున్నామని తెలిపారు. ఎవరి మీద అక్కసుతో వైద్య విద్యకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్ఏవీఎఫ్ నాయకులు సుశాంత్, సైఫ్, హుసేన్, జయసింహ, ఖలీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు చర్యలు



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ జేడీ

ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లకు నిర్దేశించిన ఆదాయ లక్ష్య సాధనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు తెలిపారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. మార్కెట్ ఆదాయం తదితర అంశాలను యార్డ్ కార్యదర్శి పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. మార్కెట్ యార్డ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ రీజనల్ పరిధిలో ఇప్పటి వరకు 8జిల్లాల పరిధిలో మార్కెట్ యార్డ్‌లలో రూ.130 కోట్ల సెస్ వసూలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.40 కోట్ల మేర వసూలు చేసినట్లు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో రూ.36కోట్లు వసూలు చేయాల్సి వుండగా రూ.10కోట్ల మేర వసూలైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రెండు విజిలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి పంటల దిగుబడులు బయటికి పోకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేసి సెస్‌లను వసూలు చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు గ్రామం వద్ద గురువారం కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. మండలంలో అక్రమ మద్యం అరికట్టేందుకు వాహనాల తనిఖీ చేస్తుండగా కోసిగి మండలం కడదొడ్డి గ్రామానికి చెందిన బొంపల్లి ఈరన్న, కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్ర వాహనంపై కర్ణాటక నుంచి 6 బాక్సుల కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తీసుకొస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: పట్టణంలోని బావాజీపేటకు చెందిన బోయ శివ అనే వ్యక్తి 30 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా గురువారం రాత్రి మండలంలోని ఇస్వీ గ్రామం సమీపంలోని జోడి బసవేశ్వరస్వామి ఆలయం వద్ద అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర విలేకరులకు తెలిపారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం



పౌష్టికాహారం ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ నాగమణి

పెద్దకడబూరు : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వలన తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నాగమణి అన్నారు. పెద్దకడబూరు 2వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా శిశువుల ఎదుగుదల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయకుమారి, వీరగోవిందమ్మ, ఏఎస్‌ఎం ఈశ్వరమ్మ పాల్గొన్నారు.